
# ఎత్తులూ పై ఎత్తులూ!

పొత్తూరి విజయలక్ష్మి



సెల్‌ఫోన్ మోగింది. ''హలో!'' అన్నాడు పర్వతం.

''నేనేనండీ పానకాల్ని''

''హమ్మయ్య! నీ కోసం చూసి చూసి నేనే చేద్దామనుకుంటున్నాను. ఎలా వుంది అక్కడ?'' అడిగాడు పర్వతం.

''ఎలా వుందంటేనండీ! అంత బ్రహ్మాండంగా లేదుగానీ ఓ మాదిరిగా బానేవుందండి'' చెప్పాడు పానకాలు.

''సర్లే ఇప్పటికిప్పుడనుకుంటే బ్రహ్మాండంగా ఎలా వుంటుంది? ఆ మాత్రం సభ ఏర్పాటు చేశావు అంతే చాలు. జనం బాగావచ్చారా?''

''బాగా అంటే అంత బాగా రాలేదుగానీండి ఓ మాదిరిగా వచ్చారండీ!''

''సర్లే మనం సభ మొదలుపెట్టేసరికి ఇంకా వస్తార్లే. మీడియా వాళ్ళు వచ్చారా?'' పర్వతం ప్రశ్న.

''మీడియా వాళ్ళంటే పెద్ద ఛానలునించి రాలేదుగానీండి ఓ మాదిరి ఛానల్సు వాళ్ళొచ్చారండీ'' పానకాలు సమాధానం.

''సర్లే కొంతమంది మాత్రోవస్తారు. ప్రస్తుతం పెద్దాయన పక్కూరు సభలో వున్నారు. అక్కడినించి ఇక్కడికి వస్తారు. ఇక్కడినించి మీ ఏరియాకి వస్తారు. ఎప్పటికప్పుడు నీకు ఫోన్ చేస్తుంటానులే'' అని చెప్పి డిస్కనెక్ట్ చేశాడు పర్వతం.

పర్వతం అసలు పేరు పార్వతీశం. గత పదిహేనేళ్ళకు పైగా రాజకీయాల్లో చురుగ్గా తిరుగుతున్నాడు. బాగా ఒళ్ళు చేసి లడ్డులా

తయారవడంతో అందరూ పర్వతం అనడం ప్రారంభించారు.

పాలిటిక్స్‌లోకి రాగానే పదవులొచ్చేయవు. ఇరవైలో చేరితే అరవైలో పదవి వచ్చినా గొప్పే. పర్వతానికి ఇప్పుడు నలభైదాటాయి. పదవి ఇంకా కనుచూపుమేర లేదు. కాకపోతే ఆ పార్టీ గొడుగు కింద, అధికారం హడావిడి. సభలు పెట్టించడం, బంద్‌లు చేయించడం వంటివి పకడ్బందీగా చేయిస్తాడు. పర్వతానికి పనప్పచెపితే ఇక తిరిగి చూసుకోనవసరం లేదని పై వారికి ఓ నమ్మకం. అభిమానం.

కింది వాళ్ళకి కూడా పర్వతం అంటే భయభక్తులున్నాయి. అప్పటిదాకా ఏదో రొటీన్‌గా రోజులు సాగిపోతున్నాయి. మరో ఏడాది ఆగి అప్పుడు బద్ధకం వదిలించుకుని ప్రజల్లోకి వెళ్దాం అనుకుంటుండగా అనుకోని సంఘటనలు సునామీలా వచ్చిపడ్డాయి.

ఆటంబాంబు పేలటం, వంతెనలు కూలడం వంటి దుర్ఘటనలు జరిగేసరికి ఓ పార్టీనాయకుడు ''తొందరపడి ఒక కోయిల ముందేకూసింది'' అన్నట్లు అటు ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తూనే ''మేము పాలనలోకి రాగానే బియ్యం చవగ్గా ఇస్తాం. ఉచితంగా కరెంటు ఇస్తాం'' అనేశారు.

దాంతో దుమారం రేగింది.

''ఈ మాత్రం దానికి వాళ్లు వచ్చి ఇచ్చేదేమిటి బోడి!! మేమిప్పుడే ఇస్తాము. ఆ రెండే కాదు ఇళ్ళిస్తాం. వాకిళ్ళిస్తాం'' అని రెచ్చిపోయారు అధికారపక్షం వారు.

''మేము గనక వస్తే వాళ్ళిద్దరూ కలిసి ఇచ్చేవి కాక ఇంకా చాలా చాలా ఇస్తాం'' అన్నారు ఇంకోపార్టీవారు.

ఇక ఎవరికీ ఒళ్ళు తెలియడంలేదు. వాగ్దానాల పైన వాగ్దానాలు. బియ్యం కాదు అన్నం వండి పెడతాం అని ఒకరు.

పాడిపశువులు ఇచ్చి పాలుకూడా పితికి పెడతాం అని మరొకరు.

రాష్ట్రంలోని పేదలందరినీ లక్షాధికారులను చేస్తామని ఇంకొకరు. లక్షలేం ఖర్మ కోటీశ్వరులని చేస్తామని వేరొకరు.

మూడుముక్కలాటలో గుడ్డి పందెం కాసే వాళ్ళలాగా ఒకరిని మించి మరొకరు ప్రగల్భాలు పలుకుతూ వెర్రెక్కిపోతున్నారు.

ఈ పిట్టల దొరల ప్రగల్భాలకి వేదిక కావాలి.

సభలు కావాలి. జనం రావాలి. ఆర్భాటం అట్టహాసం కావాలి.

నిజం చెప్పాలంటే రాజకీయ నాయకుల మాటలమీద జనానికి ఏనాడో నమ్మకం పోయింది.

ఏ నాయకుడైనా ఎన్నికలముందు ఎన్ని వాగ్దానాలు చేసినా అధికారంలోకి రాగానే ప్రజలకి టోపీ పెట్టేసి, మీ కెంతో చేద్దామనుకున్నాం. కానీ గతప్రభుత్వం వారి తెలివితక్కువ నిర్ణయాల వల్ల ఖజానా ఖాళీ అయిపోయింది.

కాస్త కాలూ చెయ్యీ కూడదీసుకుని మేమిచ్చిన మాట నిలబెట్టుకుంటాం అంటారు.

ఆ తర్వాత ఓ రెండేళ్ళు వారూ, వారికి కావలసినవారూ పదవిలోకి రావడానికి పెట్టిన ఖర్చుకు పదింతలు వెనకేసుకుని కొంచెం నిలదొక్కుకుంటారు.

ప్రజాసేవ చేస్తున్నాం అని హోరు పెట్టి చెప్తూనే వుంటారు. కానీ అవన్నీ మాటలకే పరిమితం అయిపోతాయి.

ఎకరాలకి ఎకరాలు పంట ఎండి పోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూ వుంటే

అయ్యో రామా అదంతా మీడియా వారి దుష్ప్రచారం. ఒక ఎకరం పంట ఎండిపోలేదు. ఇవిగో లెక్కలు అని కాయితాలు చూపిస్తారు.

వచ్చేవానాకాలంలో ఒక్కచుక్క నీరు రోడ్డు మీద నిలిస్తే అడగండి అని ఛాలెంజ్‌లు చేస్తారు.

వానాకాలం ప్రజలు ఈదుకుంటూ రోడ్లమీద తిరుగుతారు.

ప్రజాహిత కార్యక్రమాలు మొదలవుతాయి. కోట్లు ఖర్చవుతాయి. కానీ ప్రజలకు మాత్రం లాభం కలుగదు.

అదేమని నిలదీసి అడిగితే అన్నం పెడితే అరిగిపోతుంది, వస్త్రాలు ఇస్తే చిరిగిపోతాయి. ఎండవాత పెడితే బ్రతికినన్నాళ్లు వుంటుంది.

అని సామెత చెప్పినట్లు ఏదో చెప్పి చిద్విలాసంగా నమ్మిస్తారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇదంతా చర్వితచరణం.

కాకపోతే జనం కాస్త తెలివి మీరారు.

అది వరకులాగా గొర్రెలమందలాగా సభలకు వెళ్ళి నోరుతెరుచుకుని వాళ్ళు చెప్పింది విని రావటంలేదు. గొడవ చేస్తున్నారు.

అందుకని సభలు పెట్టడానికి కాస్త జంకుతున్నారు నాయకులు. కానీ సభలు పెట్టకపోతే ప్రచారం జరగదు.

ఎగ దూస్తే బ్రహ్మ హత్య దిగదూస్తే నీ హత్య అన్నట్లుంది వారి పరిస్థితి.

ఇటువంటి క్లిష్టపరిస్థితులలో హఠాత్తుగా సభలు పెట్టి ప్రచారం చెయ్యడం అంటే మాటలా.

సునామీ వచ్చినట్లుంది పరిస్థితి.

ఏదో కిందామీదా పడి మేమెందులోనూ తీసిపోము అంటూ పోటీలుపడి సభలు పెడుతున్నారు.

అందులోనూ ఏదో ఓ సభ పెట్టి ప్రసంగించి చేతులు దులిపేసుకునే రోజులు కావాయే.

ఒకరోజు కనీసం నాలుగు సభలన్నా పెట్టాలి. ఓ చోటనించీ మరోచోటకి ఏదో వాహనంలోనో చేరాలి. జనాన్ని బుట్టలో వేసే ప్రయత్నం చెయ్యాలి.

ప్రస్తుతం అదే జరుగుతోంది.

సభలంటే మాటలా. ఎంత హంగామా ఆర్భాటం కావాలి. ఎంతమందీ మార్బలం కావాలి. అంతా చచ్చి సతమతం అవుతున్నారు.


ఆ వేళ నాలుగు సభలున్నాయి. మొదటి సభ బాగానే జరిగింది. రెండో సభ జరుగుతోంది.

మూడవ సభ జరిగే చోట వున్నాడు పర్వతం. ఆ సభకి తర్వాత సభకీ కూడా అతనే ఇన్‌ఛార్జ్.

వేరే ఎవరూ దొరకలేదు. అందుకని అక్కడ పానకాలుని పెట్టి సెల్‌ఫోన్‌లో ఆదేశాలిస్తూ హడావిడి పడిపోతున్నాడు.

పానకాలుకి పాపం రాజకీయాలు కొత్త. నాలుగేళ్ళే అయింది రాజకీయప్రవేశం చేసి. ఉత్త ఎండ మనిషి. స్వంత తెలివితేటలు లేవుగానీ చెప్పిన పని మాత్రం తుచతప్పకుండా చేస్తాడు. అందులోనూ పర్వతం అంటే చాలా గురి.

తనమీద నమ్మకం వుంచి పర్వతంగారు ఈ సభ బాధ్యత తనమీద పెట్టినందుకు చాలా గర్వంగా వుందతనికి. శాయశక్తులా శ్రమపడుతున్నాడు.



ఏర్పాట్లు బాగానే చేశాడు. వేదిక బ్రహ్మాండంగా కట్టాడు. జండాలవీ అలంకరించాడు. పూలదండలు శాలువాలు, కిరీటాలు వగైరా అన్నీ సిద్ధం చేశాడు. ఎటొచ్చీ జనమే కాస్త తక్కువగా వున్నారు. ఆ సమయానికి వస్తార్లే అనుకుని సరి పెట్టుకున్నాడు. పెద్దాయనతో ఎలాగూ చాలామంది వస్తారు. వాళ్ళూ వీళ్ళూ కలిస్తే సభ నిండుతుంది అనుకున్నాడు.

రెండవ సభకూడా బాగానే ముగించి, ముచ్చటగా మూడోచోటికి వచ్చాడు పెద్దాయన.

పర్వతం పానకాలుకి ఫోన్ చేశాడు.

''ఇదుగో ఇప్పుడేవచ్చేరు. ఇక్కడ అయిపోగానే అక్కడికొచ్చేస్తాం. నువ్వు రెడీగా వుండు'' అని చెప్పాడు. పానకాలు హడావిడిగా అటూ ఇటూ పరిగెట్టడం మొదలుపెట్టాడు.

మూడో సభ ప్రారంభం అయింది. వాళ్లూ వీళ్ళూ మాట్లాడి పెద్దాయన వంటి నాయకుడు నభూతో న భవిష్యతి అని పొగిడారు. శాలువ కప్పారు. కిరీటం పెట్టారు. ఇంకా కత్తులూ విల్లంబులూ, గదలూ వంటి ఆయుధాలు (అట్టతో చేసినవి) ఇచ్చి సన్మానించారు.

అవన్నీ ధరించిన పెద్దాయన పాతజానపద సినిమాల్లో కాంతారావులా కళకళలాడిపోయారు.

అమితోత్సాహంతో ఉపన్యాసం మొదలు పెట్టారు. అందులో అప్పటికి రెండుసభల్లో మాట్లాడి వచ్చారేమో మాంచి వూపులో వున్నారు.

అవి ఇస్తాం ఇవి ఇస్తాం అంటూ వరాల జల్లులు కురిపించసాగారు. విని విని విసుగెత్తిన జనంలోంచి గుంపుగా ఆడవాళ్ళు హఠాత్తుగా లేచి అరవడం మొదలుపెట్టారు.

మొదటి దానికి మొగుడులేడు కడవారి దానికి కల్యాణం అన్నట్లు గతంలో ఇస్తామన్న వాటికి దిక్కూ దివాణం లేదు ఇంకా కొత్తవేం ఇస్తారు అని ఆడిపోసుకోడం మొదలుపెట్టారు.

వాళ్ళని వూరుకోబెట్టాలని శాయశక్తులా ప్రయత్నం చేశారు కార్యకర్తలు. కానీ వాళ్ళు వూరుకోలేదు. రెచ్చిపోయి మాటకుమాటా ఎదురుచెప్పడం ప్రారంభించారు.

చౌక దుకాణాల్లో బియ్యం నిండా పురుగులేనన్నారు. ధరలు మండిపోతున్నాయన్నారు. సంతకాలు పెట్టించుకుని ఇన్నాళ్ళయినా ఇళ్ళివ్వలేదన్నారు.

అటు కార్యకర్తలకు ఓర్పు నశించిపోయింది. పర్వతం రంగంలోకి దిగాడు.

ఇరు వైపుల వాళ్ళూ జుట్టూ జుట్టూ పట్టుకున్నారు. కుర్చీలు విసిరేసుకున్నారు గొడవయిపోయింది. పోలీసులు లాఠీలుచ్చుకుని రంగంలోకి దిగారు.

''ఛోటా నాయకుల వీరంగం, ఇది సభా రభసా'' అని హెడ్డింగులతో వార్తలు రాసేసుకున్నారు ప్రెస్‌వాళ్ళు.

మీడియా వాళ్ళు మూగిపోయి అన్యాయం జరిగితే 'ఏది న్యాయం అని అడిగిన వారి మీద జరుగుతున్న అన్యాయం ఇది' అంటూ ఓ! చెప్పేస్తున్నారు. ఇంతలో పర్వతం సెల్‌ఫోన్ మోగింది. పానకాలు చేశాడు.

''గురూగారూ ఇంకా బయల్దేరలేదా. ఇక్కడ జనం వెళ్ళే మూడ్‌లో వున్నారు.'' అంటూ గాభరా పెట్టేశాడు.

''ఇక్కడ కాస్త గొడవగా వుంది. నేనేదో ఏర్పాటు చేస్తానుండు'' అని చెప్పి చుట్టూ చూశాడు.

పరిస్థితి గందరగోళంగా వుంది. ఈ గొడవంతా సద్దుమణిగి అక్కడికి వెళ్ళేసరికి కాస్త సమయం పడుతుంది. ఇంకెవరైనా అయితే కంగారు పడేవాళ్ళే. కానీ పర్వతం ఇటువంటి విషయాల్లో పండిపోయాడు. అందుకే వెంటనే వేదిక మీదికి వెళ్ళి ఓ శాల్తీని దొరకబుచ్చుకుని పరిస్తితి వివరించాడు. అందాకా మీరువెళ్ళి అక్కడ మేనేజ్ చెయ్యండి.



అనుకోని కారణాల వల్ల సభ ఆలస్యం అయిందని చెప్పి అందాకా మీరే ఏదో మాట్లాడండి. జనాన్ని ఎంగేజ్ చెయ్యండి.

ఇక్కడి పరిస్థితి చక్కబెట్టి మేము వస్తాం అని చెప్పి ఆయన్నీ ఆయన్తోపాటు మరికొంతందినీ పంపించేశాడు.

ఆ బయలుదేరిన శాల్తీ పాపం గట్టివాడే. పార్టీ కోసం గానుగెద్దులా కష్టపడుతాడు. కానీ ఆయనకి ఏనాడూ పదవి లభించలేదు. అలా అని ప్రాముఖ్యత లేదా అంటే అదీకాదు. ప్రతిసభకీ సమావేశానికీ ఠంచనుగా హాజరు పరిచి వేదికమీద కూర్చోబెడతారు. అక్కడకూర్చుని కునికిపాట్లు పడుతూ వుంటాడు ఈయన. ఆయన్ని కరివేపాకులా కావలసినప్పుడు వేస్తూ అక్కరలేనప్పుడు తీసేస్తూ వుంటారు.

ఇప్పుడాయన స్వయంగా సభ నిర్వహణకు బయలుదేరాడు.

నాలుగవ సభ దగ్గర అంతా హడావిడిగా వుంది. ఈ సభ కోసం ఒక పక్క రోడ్డు బ్లాక్ చేసేశారు. కాస్త అటుగా రైల్వే లెవెల్ క్రాసింగ్ వుంది. ఆ గేటు మూసేశారు. సరే అలవాటు ప్రకారం సగం రోడ్డు తవ్వేశారు. ఆఫీసుల్నించీ వచ్చేటైము ట్రాఫిక్ జామ్ అయిపోయింది. అందులో నాలుగు బస్సులు సాఫ్ట్‌వేర్ కంపెనీలవి వున్నాయి. వాటి నిండా ఉద్యోగులు వున్నారు.

ఈ ట్రాఫిక్ జామ్‌లో ఏం చేస్తాం? పోనీ వెళ్ళి ఆ సభలో కూర్చుందామా కాసేపు కాలక్షేపం అని ఆలోచన వచ్చింది ఒక అమ్మాయికి సరే అంటే సరే అనుకుని డ్రైవర్లకి చెప్పి అందరూ పొలోమని దిగి సభకి వెళ్ళారు. వారివెంట మరింతమంది. అంతమంది జనం రావడంతో పానకాలూ సర్దాపడ్డాడు. అంతలోనే అసలు వాళ్ళంతా వచ్చేశారు.


''అబ్బా జనం బాగానే వచ్చారే'' అన్నాడు కరివేపాకుగారు.

''అవునండీ మామూలు జనమే కాదు మంచి చదువుకున్న వాళ్ళు డొక్కశుద్ధి వున్నవాళ్ళు కూడా వచ్చారు'' అన్నాడు పానకాలు.

వేదికమీద కార్యక్రమం మొదలైంది. ముందు సర్దాపడినా ఎప్పుడూ కూర్చుని కునికి పాట్లు పడే కరివేపాకుగారికి తను ఉపన్యాసం ఇవ్వాలనేసరికి కంగారు వేసింది. వెంటనే సెల్‌ఫోను తీసి మూడో సభలో వుండిపోయిన ఒకయనకి ఫోన్ చేసి ''నాకేవిటో టెన్షన్‌గా వుంది. ఏం చెయ్యానూ? ఏం మాట్లాడను?'' అని సలహా అడిగాడు.

''ఏం ఫర్వాలేదు. మాసాటి వాడు ఈ భూమ్మీద లేరని ప్రగల్భాలు పలికేసెయ్. ఇంకా తర్వాత ఎడాపెడా వాగ్దానాలు చేసిపారెయ్. నీ ఓపిక నిలబెట్టుకోవాలని రూలేం లేదుగా'' అని ధైర్యం చెప్పాడు ఆ మిత్రుడు.

అనివార్య కారణాల వలన పెద్దాయన రావడం ఆలస్యం అయింది. వారిప్పుడో ఇహనో వచ్చేస్తారు. అందాకా వారి ఆంతరంగికులు ఆప్తులూ అయిన కరివేపాకుగారు మాట్లాడతారు.



అని ప్రకటించారు.

వెంటనే మైకు ముందుకి వచ్చాడు కరివేపాకు.

తమ ప్రభుత్వం సాటిలేనిదన్నాడు. రామరాజ్యం అన్నాడు, ధర్మం నాలుగు పాదాలా నడుస్తుందన్నాడు. స్వర్ణయుగం అన్నాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆయన ఉపన్యాసం విని భలే సర్దాపడ్డారు. వెధవది ఈ మధ్య మంచికామెడీ సినిమా గానీ, ప్రోగ్రాంగానీ రావడంలేదు. ఆ ట్రాఫిక్‌జామ్ ధర్మమా అని ఈ కామెడీ షో చూస్తున్నాం. అని నవ్వుకున్నారు. అప్పుడప్పుడు ఆనందం పట్టలేక చప్పట్లు కూడా కొట్టేరు.

దాంతో మరింత రెచ్చిపోయారు కరివేపాకుగారు. ఈ మధ్యనే ఎక్కడో చదివిన ఆర్టికల్ గుర్తొచ్చింది. మామూలు వాగ్దానాల బదులుగా వెరైటీగా వుంటుందని మెరుపులా ఆలోచన వచ్చింది.

వెంటనే మొదలుపెట్టాను. ''ఈ మధ్యన చదివాను పనివత్తిడివల్ల వేళాపాళా లేని కంప్యూటరు ఉద్యోగుల వల్ల, ఇంకా ఎత్తుకి ఎదగాలనే తాపత్రయం వల్ల, యువకులలో శృంగారం పట్ల ఆసక్తి తగ్గిపోతోందని సామర్థ్యం కూడా సన్నగిల్లుతోందని దానివలన స్త్రీలలో అసంతృప్తి కలుగుతోందని సర్వేవల్ల తెలిసిందిట.

మాది ఆడవారికోసం ఏర్పడిన పార్టీ. ఆడవారిలా అసంతృప్తి చెందడం మాకు చాలా బాధగా వుంది. కాబట్టి ఈ విషయంలో వెంటనే ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రవేశపెడతాం. ఈ కార్యక్రమం కోసం తక్షణం నడుం కట్టుకొందాం. మీ కార్యకర్తలు అందరూ అహోరాత్రులూ శ్రమించి, అవసరం అయితే కోట్లు వెచ్చించి,

ఆవేశంతో చెప్పుకుపోతున్న కరివేపాకుగారికి జనం వేదిక మీదికి దూసుకురావటంతో అంతరాయం కలిగింది. వేదిక మీద వున్న వారికి భారీ ఎత్తునే పౌరసన్మానం జరిగింది.

పోలీసులు కల్పించుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అక్కడ కూడా సభలో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మా సోదరీమణులు కొంతమందికి మేము కల్పించిన అవకాశాలు అందలేదని అర్థం అయింది. వెంటనే వారికేసులను పరిశీలించి అయా అధికారుల మీద చర్యతీసుకుంటాం (ఎప్పుడైనా చివరికి జరిగేది అదే!)

అంటూ ఉపన్యాసం ముగించాడు పెద్దాయన.

పర్వతం పానకాలుకి ఫోన్ చేశాడు.

''ఇక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చింది బయల్దేరి వస్తున్నా'' అన్నాడు.

''ఇక్కడ పరిస్థితి చెయ్యిదాటిపోయింది మీరొచ్చినా జనం ఎవరూ లేరు. ఓ మాదిరిగా అభాసు అయింది'' అంటూ గద్గదకంఠంతో చెప్పాడు పానకాలు. జరిగింది విని పెద్దలంతా బాధపడ్డారు. ''పోన్లెండి జరిగిందేదో జరిగిపోయింది. అది పీడకలలా మర్చిపోదాం'' అనుకున్నారు.

వాళ్ళు మర్చిపోయినా శత్రుకూటమి వూరుకుంటుందా? ఏకి పెట్టారు. అన్ని పేపర్ల హెడ్ లైన్స్‌లోనూ ఇదే వార్త. అన్ని ఛానల్స్‌లోనూ ఇదేగొడవ.

వెంటనే అర్జెంటుగా సమావేశం అయ్యారు.

కరివేపాకును దుయ్యబట్టారు. కొందరు.

''పాపం ఆయనేం చేస్తాడు? ఆయనకి ఈ ఉపన్యాసాలూ అవీ అలవాటా? పాడా? ఏదో మాట్లాడబోయాడు. అది కాస్తా అయ్యగారిని చెయ్యబోతే కోతి అయిందన్నట్లూ అయిపోయింది.'' అని ఆయన్ని వెనకేసుకొచ్చారు మరి కొందరు.

''ఇది ఒకరిని తప్పుబట్టే సమయం కాదు. పరిస్థితులు ఇట్లా వచ్చాయి. మామూలుగా అయితే ఎన్నికలొస్తున్నాయంటే మేనిఫెస్టో గట్రా తయారు చేసుకుని రంగంలోకి దిగుతామాయెనూ.''

''ఇప్పుడేమో అర్థాంతరంగా వాగ్దానాలు చెయ్యాల్సి వచ్చె.

ఏం చేస్తాం? తడబడిపోతున్నాం. ఇకముందు కాస్త జాగర్తగా వుంటేసరి.''

''అయినా ఏం మునిగిపోలేదు. రేపీపాటికి ఇంకే పార్టీ వాళ్ళైనా ఇంతకు మించిన వాగ్దానం చెయ్యకపోతారా అప్పుడు మనం వాళ్ళని పీకిపాకాన పెట్టకుండా వుంటామా?'' అనుకున్నారు.

★


*With Best Compliments From*

**Ph: 23079802**

**UNIVERSAL TRADING CORPORATION**

**89, Panchaseela Colony,**
**Opp. Pragathi School,**
**IDA Gandhi Nagar,**
**Hyderabad - 500 037**

**Dealers in : Industrial Oils & Greases and**
**General Order Suppliers**